

క్రేసులోని ఆఖరి సిగరెట్టు కూడా యాష్‌ట్రేలో చుంయ్‌మని పోయింది. మామూలు కుర్చీనే ఈజీచైర్‌గా భావించుకుని, గోడకు కాళ్ళు సంధించి, వెనక్కు జేరబడి దీర్ఘాలోచనా పరుడై వున్న రాజుకు, ఐడియా మాత్రం ఇంకా కుదరలేదు.



# కనబడుటలేదు...

రావి కొండలరావు





ఆపత్రికారంగానే క్రిందపుస్తకాలమధ్యలో శేషపాన్పుపైన పవళించిన విషుమూర్తులవారి ఫోజులో ఎడమచేతిని నేలకు నించి - అరచేతిలో తలను పెట్టుకుని అంతకంటే ఆలోచనాపరుడైవున్న రామారావుకుకూడా 'క్లూ' దొరకలేదు.

ఈ మిత్రులిద్దరూ రెండుగంటల ముప్ఫయ్యారు నిమిషాలయి అట్లా ఆలోచనలో గడ్డ కట్టుకుపోయినట్టు - టేబిలుమీదనున్న గడియారం ఖచ్చితంగా చెబుతున్నది. అట్లా గడ్డకట్టుకుపోవటానికి కారణం ఏమిటంటే - రామారావు కాలేజీకి కట్టాల్సిన ఫీజుకట్టలేదు. ఫైనుతోకట్టవలసిన సమయం కూడా మించిపోతున్నది. తండ్రిదగ్గర రామారావు కాలేజీ ఫీజుకని వసూలుచేసిన రొక్కాన్ని ఈ ఇద్దరుమిత్రులూ సినిమాలకూ, సిగరెట్లకూ, తిరగటానికీ వినియోగించారు. రాజుఒక్కడూ రూమ్‌లో వుంటున్న విద్యార్థి. రామారావు తలిదండ్రుల చాటునపెరుగుతున్న విద్యార్థి. రాజు తాను కట్టాల్సిందేదో కట్టేశాడుకాబట్టి, అతనిదగ్గరడబ్బులేదు: రామారావుకు ఎక్కడనుంచీ డబ్బురాదు. ఇప్పుడా డబ్బు సంపాయించి, ముందు కాలేజీకి ముడుపు చెల్లించాలి. దానికోసమనే ఈ ఉభయులూ ఆలోచనమీద ఆలోచన గావిస్తూ, మధ్యలోఫోజులు మారుస్తూ, సిగరెట్లు పీలుస్తూ ఇంతసేపాయి కిందా మీదా పడుతున్నారు.

క్రిందనున్న శేషశాయి. చెయ్యిమార్చుకొని నిట్టూర్చి 'హోహో' అన్నాడు. కుర్చీలోని రాజుగారు 'హా హా' అన్నారు.

'హోహో అంటున్నావు-ఏదయినా తట్టిందేమిటోయ్?' అన్నాడు లేవకుండానేరామారావు-అతనికి ఏకోశానా తట్టిచావదనే దృఢనమ్మకం గలవాడవడంచేత.

'నా బొంద తట్టింది. నువ్వు 'హాహా' అన్నావని నేను హో హో అన్నాను' అన్నాడు రాజు. పొరపాటున ఎక్కడైనా సిగరెట్టు నక్కివుందేమోనని కేసులో గాలిస్తూ.

మరో పదినిమిషాలుపాటు ఇద్దరూ తలకాయలు బ్రద్దలుచేసుకున్నాక 'రాజూ' అన్నాడు రామారావు లేచి కూచుని.

'ఏంమంత్రీ? ఐడియా దొరికిందా?'

'దొరికింది. ఈరకం ఆలోచన ఇంక లాభం లేదనేది'

'ఇంకోరకం ఆలోచన ఎట్లా చేద్దామో అదీ చెప్పు'

'ఎక్కడికయినా వేటకు వెళితే?'

'నయాపైసా రాలదు. ఆపైన నీయిష్టం'

ఇద్దరూకలిసి ఎక్కడైనా డబ్బుదొరికే చోట్లు వున్నాయేమోననీ, ఎవడైనాఅప్పిచ్చేనాథుడున్నాడేమోననీ తెగ ఆలోచించారు మళ్ళీ. దమ్మిడీ లాభం లేకపోయింది.

'వైద్యుడెవడైనా నీకు తెలిసినవాడు లేడూ, అప్పిస్తాట'అన్నాడు రామారావు.

"అప్పిచ్చువాడు వైద్యుడన్నారనా-ఏవైద్యుడూ ఇవ్వడు. కనీసం 'మాకు'కూడా ఇవ్వడు:"

"ఏం సాధనం?"

అంతే

"ఏం సాధనం?" అనుకున్నారిద్దరూ.

టానిక్ తాగితే బలంవచ్చినట్టుగా - టీ తాగితేఐడియావస్తుందని ఎవరో చెప్పారుట-ఇద్దరూబయల్దేరి రాజుజేబులోమిగిలిన చిల్లర డబ్బులతోటీలు తాగారు. కొంతదూరం అట్లా నడిచారు. రోడ్లు కొలిచారు. వీధులన్నీ సర్వే చేశారు.

ఇక తిరగలేక, రాజూ రామారావూ ఒక సందు ప్రక్కనే వున్న తూముగట్టుమీద చతికిల బడ్డారు. ఈతిరగడంలో కొంతమంది మిత్రులలాంటి వారు తారసిల్లగా, తృణమో రుణమో ప్రాధేయపడ్డారు. ఉన్న మిత్రులంతా కలిసి తలో ఐదూ, కనీసం మూడూఇచ్చినా చాలని అభిప్రాయపడ్డారు. అదీ పారలేదు. ఇంతవరకూఒక్కకానీ ఐనా దొరక్కపోగా కనీసం అర్థ అయిడియా ఐనా దొరకలేదు.

తూము గట్టుమీద జేరబడిపోయినరాజుకు దూరంగాపోతున్న ఓ అబ్బాయిని చూడగానే అద్భుతమైన, మహోన్నతమైన ఐడియా వచ్చేసింది. ఒక్కనిమిషం ఆలోచించి - తపీమని లేచినించుని 'దొరికింది' అని అరిచాడు.

"గట్టిగా పట్టుకో, వదలకు" అన్నాడు రామారావు హాస్యంగా.

"చూస్తూవుండు. దీన్ని మించిన పథకం లేదు. పద రూమ్‌కు"అనిలేచాడు. చెబితేకాని లేవనన్నాడురామారావు. వస్తేకాని చెప్పనన్నాడు రాజు. కొంతసేపటికి రాజే నెగ్గాడు.

రూములో కూచుని ఇద్దరూ మళ్ళీమొదటి ఫోజుల్లోకి వచ్చారు. రాజు ప్రారంభించాడు-

"ఏమిటంటే మీ నాన్నకు నువ్వుఅంటే ప్రియమేగా ?"

"లక్ష రూపాయల ఖరీదనుకో"

"మధ్యలో నువ్వేం మాట్లాడనవసరం లేదు. చెప్పిందంతా విను. అంచేత, ప్రియమైనా చవకయినా ఏతండ్రీ కొడుకు కనిపించలేదంటే కంగారు పడతాడు. ఈ క్షణం నుంచీ నువ్వు మీ నాన్నకు కనిపించవు. ఎవరికీ కనిపించవు. నా రూమ్‌లోనే వుంటావు. రెండు రోజులుపోయాక, నీ కోసం అని నేను మీ యింటికి వెళతాను. ఈలోపలే మీ నాన్న నువ్వుకనిపించలేదనినీకోసంరావచ్చుననుకో. అప్పుడు నువ్వు బాత్‌రూములో వుంటావు. నీకోసం అంతటా గాలిస్తాము. ఎక్కడా దొరకవు. ఇంక గత్యంతరం లేదని, నీఫొటో పేపర్లో ప్రకటించి- ఫలానావాడు తప్పిపోయాడనీ, వెదికి తీసుకొస్తేనూరురూపాయలు బహుమానమనీ వేస్తాము. నేను బయల్దేరి తీసుకొస్తా నంటాను. బయల్దేరతాను. రెండు రోజులు పూరుకున్నాక నిన్నుతీసుకెళ్ళి మీ నాన్నకు వప్పగించి ఆ నూరో నూటపదార్లో పుచ్చుకుంటాను. ఇది ధోకాలేని ఐడియా. ఇన్ని గంటలనేపు అవస్థ పడబట్టి, ఇంత చక్కనిది తట్టింది. తిరుగులేదు. ఆ వచ్చిన డబ్బులో కాలేజీకి కట్టాల్సిందేదో కట్టేసి, మిగిలినదాంతో...." అని రాజు తక్కున ఆగిపోయాడురామారావుని చూసి. ఈమహత్తరమైన ఐడియాను, ఐడియాలోనినూరురూపాయలనువిన్న రామారావుఅమాంతం మూర్ఛపోయాడు. తన ధోరణిలో ప్రసంగించుకుంటూ పోతూ రాజు ఇది గమనించనేలేదు.

"ఓయ్ రామారావూ-రామ్...." అని నీళ్ళుచల్లి లేవగొట్టి-సగర్వంగా నవ్వొకటి వెదజల్లాడు రాజు.

"ఏమిటో అనుకున్నాను రాజూ! నువ్వు సామాన్యుడివికావు-నీతలకాయ ఈలోకంలో వుండవలసినదికాదు. ఏమి ఐడియా రాజూ,

ఏమి ఐడియా అన్నాడు రామారావు వొళ్ళు మరచిపోయి.

"సరే. ఇంక నువ్వు చెయ్యాల్సింది చాలావుంది. నువ్వే ఇంక రాజువి. అంతే మరేంలేదు.రాజులాగా ఈ రూమ్‌నే కోటగా భావించుకుని. కాలు కదపనఖ్ఖర్లేకుండా. కొన్నాళ్ళు జీవిస్తావు. మన మీల్స్‌టిక్కెట్లు పెట్టికారియర్‌తెప్పించుకుంటాము.నీకుకావల సిన సదుపాయాలన్నీ నేనుచేస్తాను. నువ్వు మాత్రం చాలా జాగ్రత్తగా ఎవరికంటా పడ కుండా...."

"ఒకవేళ జానకి ఈ వీధిలోంచిపోతేనో?"

"పోయినా.ఇక్కడికివచ్చి నిన్ను పిలిచినా సరే-నువ్వున్నట్టు తెలియనివ్వరాదు. కాస్త-జారిందా.గోవిందా!ఆతర్వాతచాలా అవస్థ."

"సరే నువ్వుకూడా ఎవరికీ చెప్పరాదు. నాకోసం నువ్వు కాఫీ.టిఫినూతెస్తున్నప్పుడు ఎవరైనా నిన్ను చూస్తే గీస్తే...."

"చూడనీ నాకోసమే అనుకుంటారు. ఐనా అదంతా నేను చూసుకుంటాలేవోయ్-నువ్వుమాత్రం...."

"చాలా జాగ్రత్తగా వుండాలి-జైల్లోనున్న దొంగలాగా."

"అదిగో.అట్లా మాట్లాడితే నాదేంలేదు. నీయిష్టం.ఒక్క నాలుగురోజులుకష్టపడు.కష్ట మేమిటటసలు.సుఖపడు-తర్వాత వుందిగా!నీ కోసంపత్రికలూ.పుస్తకాలూతెచ్చిపడేస్తాను. సరే. నువ్వువుండు. నేను వెళ్ళివస్తాను"అని రాజులేచి.ముఖం కడిగి-రూముకు తాళంపెట్టి వెళ్ళిపోయాడు. రామారావు ఉషారుగా ఈలొకటివేసి - 'లాలా లలా లలలా' అని పాడి.క్రిందదొర్లాడు.

రామారావుకు ఆ సాయంత్రం హాయి గానే గడిచిపోయింది. రోజు టిఫినూ కాఫీ కాళ్ళ దగ్గరకు తీసుకొచ్చి ఇచ్చాడు. మది కాస్సేపటికి బాత్‌రూములో దూరి చల్లగా స్నానం చేశాడు. రాజు పంచకట్టుకున్నాడు. ఉభిలులైటువేసి.పత్రిక తీసిచదువుకున్నాడు. అప్పటికి ఆరున్నరయింది. రామారావుకు పత్రికా పఠనం సాగలేదు. ఆలోచనలో పడ్డాడు.సాయంత్రం పూట ఇంట్లోవుండడం అన్నది బహుశా తన జీవితంలో ఇదే ప్రథమం. ఈ పాటికి తెల్లటి గుడ్డలు వేసుకుని సిగరెట్లు కాలుస్తూ-అన్నట్లు ఈ రాజుగాడు సిగరెట్లు ఇవ్వకుండా పోయాడే. అని తిట్టు కున్నాడు.అక్కడెక్కడేనా ఏమైనా మిగిలా యేమోనని చూశాడు. కాల్చి పారేసినపీకలు తప్ప సిగరెట్ల జాడే కనిపించలేదు. సరే— ఈ పాటికి తెల్లటి గుడ్డలు వేసుకునిసిగరెట్లు కాలుస్తూ ఏ సినిమా హాలు గేటు దగ్గరో. జానకివీధిలోనో ఉండవలసిన తను.ఇట్లాఎవ డిదో పూరివాడి ఎరువుపంచ ధరించి.దొంగ తనంగా పడివున్నాడు.

రామారావు విధి. కర్మ. రాత వంటి మాటలూ. 'రాజే కింకరుడేను....' అన్న వాక్యాలూ గుర్తుకు తెచ్చుకుని నవ్వు కున్నాడు. ఈ పాటికే తనవాళ్ళు తన కోసం ఆరాట పడరు. ఎంచేతంటే. తను సాధారణంగా తొమ్మిదింటికి గాని ఇల్లు చేరడు. ఒకవేళ తొందరగా చేరితే. చదువుకోవాలనే మిష మీద భోజనంచేసి వెంటనే బయల్దేరి ఏ సినిమాకో పోతాడు. అంచేత చెప్పకుండా ఎక్కడికి వెళ్ళడం అని గాని. ఎక్కడైనా ఉండిపోవటం అని గాని సామాన్యంగా





తన పద్ధతిలో జరిగే పనికాదు. ఈ రాత్రి తొమ్మిది తర్వాతగాని. ఏ అలజడీ బయల్దేరదు. తెల్లవారేసరికి తను కనిపించ లేదన్న సంగతి పూరంతా ప్రాకి పోతుంది. అంతా ప్రాకకపోయినా. తన ఇంటి చుట్టు పట్లా—తన స్నేహితుల చుట్టూ. కాలేజీ ప్రాంతాలా ప్రాకవచ్చును. జానకికి కూడా తెలుస్తుందా ? ఫలానా రామారావెవడో కనిపించటం లేదని తెలిస్తే తెలియవచ్చును. అంతకన్నా ఆ అమ్మాయి కేమీ తెలియదు. తనెవరో జానకేం ఎరుగును. జానకిని తనెరుగును గాని! రామారావు చాలాసేపు ఇట్లాగే చాలా చాలా ఆలోచించాడు. ఎందుకనో అతనికి నెమ్మదిగా నిద్ర పట్టింది.


సుమారు తొమ్మిది గంటల ప్రాంతాల రాజు టిఫిన్ పొట్లాలతో వచ్చి తలుపు తాళం తీసి. లోపల ప్రవేశించాడు. "వా రాజే" అనుకున్నాడు రాజు. నిద్ర పోతున్న రామారావును చూసి. తలుపుకు లోపలవేపు గడియవేసి. దుస్తులు మార్చు కుని రామారావును లేపాడు.

"వూ—ఇదేమిటయ్యా పొట్లాలు తెచ్చావు ? భోజనమో ?" అన్నాడు రామా రావు బద్ధకంగా లేస్తూ.

"భోజనానికి కారియరు దొరకలేదు. రేపు సర్దుతా నన్నాడు హోటలు వాడు. ఈ పూటకు ఈ టిఫిను కాఫీ. దీనికి డబ్బుల కోసం నేనెంత యాతన పడ్డానో నువ్వెరగవు" అన్నాడు రాజు. మాట్లాడ కుండా రామారావు ఆ పొట్లాలు విప్పి. తిని - మంచినీళ్ల త్రాగి—

"ఏమనుకుంటున్నారోయ్ ?" అన్నాడు ఏదో ఘనకార్యం చేసిన వాడల్లే పోజు కొడుతూ.

"ఇంకా ఏమీ అనుకోవడం లేదు. అనుకుంటార్లే. ఈ రాత్రి కళ్ల మూసుకో.



"చాలా ఇబ్బందిగా వుంది రాజూ: నువ్వయినా లేవు"

రాజు సమాధానం చెప్పలేదు. తెచ్చిన సిగరెట్లు అతని ముందు పడేశాడు. కాస్సేపు ఇద్దరూ ఏవేవో మాట్లాడుకుని దీపం ఆర్పేసి, నిద్రకు ఉపక్రమించారు.

కాస్సేపటికి వీధి తలుపు చప్పుడయింది. 'రాజుగారూ' అంటూ ఎవరో పిలుస్తున్న పిలుపు విన్నారు.

"వచ్చాం" అన్నాడు రామారావు చట్టున లేచి కూర్చుని.

"ఏమీ చావనక్కర్లేదు. కాస్సేపు బాత్ రూములోకి పో. నేను చూసుకుంటాను"

"ఆ వచ్చేవాడు బాత్‌రూములోకి వెళ్ళాలని ఏమన్నా అంటే ?"

"అంటే చూద్దాంలేవయ్యా — నువ్వు వెళ్ళు" అని రామారావును పంపించేసి, తానువెళ్ళి తలుపు గడియతీసి 'ఎవరూ' అన్నాడు.

"నే నండీ - రామారావు తమ్ముడిని. మా అన్నయ్య ఇంకా ఇంటికి రాలేదు. ఇక్కడున్నాడేమోనని...."

"ఇక్కడ లేడే. ఏం, ఎంతసేపయింది వెళ్ళి ?" అన్నాడు రాజు. బాత్‌రూములో పొంచివున్న రామారావుకు కూడా ఈ మాటలు వినిపించాయి. అతను పొంగిపోయి చిటికె వేశాడు.

"మధ్యాహ్నం గావును వెళ్ళాడు. ఇంకా ఇంటికి రాలేదు."

"భోజనానికి రావాలన్న మాట"

"అవునండి"

రామారావుకు చిరాకేసింది. వాడికి మరికొంత ఆత్రుత కల్పించి పంపెయ్యక ఈ దాతాఖానీ ఎందుకని విసుక్కున్నాడు.

"వస్తాడులే—ఏ సినిమాకన్నా వెళ్ళాడేమో" అన్నాడు రాజు.

"అన్ని సినిమాలూ విడిచిపెట్టేశారండీ" అన్నాడా అబ్బాయి.

"ఐతే మరి ఎక్కడికెళ్ళి వుంటాడబ్బా!....ఏమోనాయనా, నాకు తెలియదు. పొద్దున్నెపుడో నాకు కనిపించాడు గాని, మళ్ళీ కనిపించనేలేదు. ఇక్కడికివస్తే వెంటనే పంపించేస్తాలే...." అన్నాడురాజు.

సరేనని ఆ అబ్బాయి వెళ్ళిపోయాడు. రాజు తలుపు గడియవేసి వెనక్కి తిరిగేసరికి రామారావు పకపక నవ్వుతూ కనిపించాడు.

"నెమ్మదిగా నవ్వు నాయనా — మీవాడింకా మెట్లు దిగివుండడు" అన్నాడు రాజు నెమ్మదిగా.

"సరేగాని .... కోటలో పాగావేసినట్టే చూశావా. పదిన్నరకే అలజడి కలిగిందీ" అన్నాడు రామారావు పక్కమీద వాలిపోతూ.

ఆ మర్నాడు ఉదయం మళ్ళీ ఎవరన్నా వస్తారేమోనని మిత్రులిద్దరూ చూశారు. ఎవరూ రాలేదు. కారియర్ భోజనం ఏర్పాటు చేసి, తానింత తిని రాజు కాలేజీకి బయల్దేరాడు.

"మాయింటి మీదుగా వెళతావా రాజూ" అన్నాడు రామారావు.





"ఉండవయ్యా. మనంకాదు ఆతురత పడవలసింది—వాళ్ళు" అన్నాడు రాజు.

"అందుక్కాదు. రాత్రి మా తమ్ముడు వచ్చాడుగా.-నేను వచ్చానో లేదోఅని మా యింటికి వెళ్ళవచ్చునేమో అని ...."

"చూద్దాంలే" అని రాజు, తలుపు తీసుకుని బయట తాళం పెట్టి వెళ్ళిపోయాడు. రామారావుకు ఏడుపొచ్చినంత పనయింది. 'వీడి పొగరూ వీడూనూ' అనుకున్నాడు. 'ఇప్పుడు ఏదానికీ నేను మాట్లాడరాదనేగా వీడి ప్రవర్తన:....కానీ కానీ ఎన్నాళ్లు!' అని రామారావు పత్రికలు తీశాడు- అవి రుచించలేదు. విసిరేశాడు.

రాజు రామారావు ఇంటి గుమ్మంముందు ఆగి—'రామారావూ' అని కేకవేశాడు. లోపల్నుంచి రామారావు తల్లి వచ్చింది.

"ఏం నాయనా- మావాడు కనిపించాడా? నిన్ననగా వెళ్ళాడు. రాత్రి రాలేదు, పొద్దున్నా రాలేదు. అసలు ఎక్కడా వుండే అలవాటే లేదు వాడికి. మహా వుంటే నీతోనే వుంటాడు. ఎక్కడికి వెళ్ళాడో నీకూ చెప్పలేదా రాజూ"? అని అడిగింది ఆమె ఆతృతగా అన్నీ ఏకరువు పెడుతూ.

"లేదండీ—నిన్న పొద్దున్నే నాకు కనిపించాడు. మళ్ళీ లేదు. నిన్న రాత్రి మీ అబ్బాయి వచ్చాడు. అప్పుడే వద్దామనుకున్నాను. ఐనా కాస్సేపటికి వచ్చేస్తాడేమో అని రాలేదు. ఇదేమిటండీ, ఇంతవరకూ రాకపోవడం ఏమిటీ ?" అని రాజు ఒకటో నెంబరు మేటి నటుడల్లే—ఆశ్చర్యం అభినయించాడు. ఇంతలో రామారావు తండ్రిగారు లోపల్నుంచి రాగా ఆ ఆశ్చర్యంలోనే చెప్పాడు సానుభూతిని మిళాయించి - 'నమస్కారమండీ' అన్నాడు.

"ఏం, తేలిందా వీడి సంగతి :" అన్నాడాయన.

"ఏమిటో నాకూ ఇప్పటిదాకా తెలియదండీ. ఇప్పుడే అమ్మగారు అంటూవుంటే విన్నాను. మీరేమన్నా కేకలు వెయ్యడం వంటివి ఏమయినా చేశారా ఏమిటి ?" అన్నాడు రాజు.

"ఏమీలేదు నాయనా. వాడిని కేకలేసేది ఎవరు ఈ యింట్లో ? ఇదిగో, ఎప్పుడైనా అంటే ఈయన అంటారు ఓ మాట. అదీ ఏమిటి - మరీ చదువు ఎగవేస్తూ వుంటే" అన్నది రామారావు తల్లి. ఇంతలో రామారావు తమ్ముడు వీధిలోంచి వస్తూ "అమ్మా ! ఉదయం సుబ్రమణ్యానికి కనిపించాట్ట" అన్నాడు. రాజు గుండె తటీమని ఆగిపోయింది. "ఎ ఎ ఎ....క్కడ ?" అన్నాడు.

"అదెక్కడో చెప్పలేదు గాని, పొద్దున్న చూశానే అన్నాడు" అన్నాడు రామారావు

● "అదేమిటిసార్! మీకు బాగా బట్టతల వచ్చేస్తోంది. మా హేరాయిల్ వాడారా?"

"లేదండీ, వృద్ధాప్యంవల్లే అయివుంటుంది."

తమ్ముడు. రాజుకు కాళ్ళూ చేతులూ గిలగిల తన్నుకొన్నట్టయింది. కొంపదీసి ఈ వెధవ బయటకొచ్చేయ లేదుగదా! ఎట్లా వస్తాడు - తాళం తన దగ్గర వుంటూంటే. అతనికేమీ అర్థంకాలేదు.

"ఐతే ఆ సుబ్రహ్మణ్యం ఏమన్నాడు?" అన్నాడు రామారావు తండ్రి.

"ఏమో, నేను అడిగితే ఆ మాట అన్నాడు - మళ్ళీ ఏమీ అనలేదు"

"ఏడిసినట్టుంది. వాడి నిర్వాకమూ, నీ నిర్వాకమూ" అని గసుపకున్నాడు బట్ట తలాయన కొడుకుమీద.

"ఎందుకు - నే కనుక్కుంటా లెండి" అని రాజు బయల్దేరాడు.

బయల్దేరిన రాజుకు ఎటు వెళ్ళడమో తేలలేదు. తన రూముకు వెళ్ళి రామారావు వున్నాడో లేడో చూసుకోవడమా, సుబ్రమణ్యాన్ని కలవడమా! సుబ్రమణ్యమే అబద్ధం చెప్పాడో, రామారావు తమ్ముడే కోశాడో అతనికి అర్థంకాలేదు. 'దిక్కుమాలిన సొద' అని విసుక్కున్నాడు, తన రూమువేపు వెళ్తూ.

రూము తాళం వేసింది వేసినట్టే వుంది. తాళంతీసి చూడగా — గుడిలో దేవుడల్లే రామారావు కనిపించాడు.

"మళ్ళీ వచ్చావేం?" అన్నాడు రామారావు.

"నా బొంద - నా కర్మానూ ఇదేదో ఈ అవస్థలతోనే పోయేట్టుంది. నువ్వేమో ఉదయం ఆ సుబ్రమణ్యానికి కనిపించావని వాడు చెప్పగా - నీ తమ్ముడు మీ యింటిదగ్గర చెప్పాడు. ఇంతలో ఎవరిమాట అబద్ధం? - అబద్ధం మాటకేంగాని - నా తాడు తెగింది. మళ్ళీ పోలోమని పోవాలి" అని చిరాగ్గా వెళ్ళి తలుపు తాళం పెట్టి నిష్క్రమించాడు రాజు, రామారావు ఏదో అంటున్నా వినిపించుకోకుండా.

రాజుకు ఇంత చిరాకు ఎందుకో రామారావుకు అర్థం కాలేదు. ఈ బందిఖానా బతుక్కి తాను చిరాకు పడాలి గాని, వీడికెందుకో చిరాకు? కొంపదీసి — ఏదన్నా దురూహతో లేడుగదా! అంటే ఈ డబ్బు కాస్తా తనచేత జిక్కించుకుని, తనను పో పొమ్మనడుగదా! ఏడిశాడు — అదేమయినా జరిగితే తను లేడూ సత్యాన్ని లోకానికి చాటడానికి! పోతే తన పరువూ పోతుందిగాని, రాజుగాడి పథకం పారనిస్తానా:....ఐనా రాజు అటువంటివాడుకాడు, అటువంటిపని చెయ్యడు అని సర్దుకున్నాడు రామారావే.

కాలేజీలో రాజూ, సుబ్రమణ్యం కలుసుకున్నారు.

"ఏంవయ్యా—నీకు రామారావు కనిపించాడా?" అని అడిగాడు రాజు.

"ఏ రామారావు?" అన్నాడా సుబ్రమణ్యం ఏదో లోకంనుంచి దిగివచ్చిన వాడల్లే.

"ఏ రామారావు? ఏ. రామారావే"

"లేదే."

"ఐతే మరి పొద్దున చూశానని రామారావు తమ్ముడితో చెప్పావుట"


"అదా, అవును—మా అన్నయ్య కనిపించాడా అని అడిగాడు—'ఆఁ'అన్నాను కనిపించాడేమో ననుకుని...." అన్నాడు సుబ్రమణ్యం ఏడిసినట్టు.

"చంపావుగదయ్యా—రామారావు నిన్నట్నుంచి కనిపించక అందరమూ అవస్థపడుతున్నాము. నువ్వేమో చూశానంటే ఎక్కడో కనుక్కుందా మనుకున్నాను. కోతలకయినా అర్థం వుండాలి" అని రాజు చరచరా వెళ్ళిపోయాడు.

"ఏమిటీ—రామారావా - నిన్నట్నుంచా - కనిపించకపోవడమా—మైగాడ్! రామారావు కనిపించకపోవడమే!.... రామారావు కనిపించడంలేదు, రామారావు కనిపించడం లేదు" అని ఎలుగెత్తి అరుస్తూ కాలేజీ ఆవరణలోకి పరుగెత్తాడు సుబ్రమణ్యం.

ఆ సాయంత్రం కాలేజినుంచి వస్తూనే రాజు, రామారావు ఇంటికి వెళ్ళాడు. తండ్రి లేడు. తల్లి మాత్రం వుంది. ఆమె స్థితి చూడగానే రాజుకు జాలి కలిగింది. ఆమెకు మధ్యాహ్నం తిండి లేదుట - ఒకటే బెంగట! ఈ నాటకం ఎందుకు ఆడుతున్నామా పాపం అనిపించింది రాజు హృదయంలో ఓమూల.

"మీరేం దిగులు పడకండి అమ్మగారూ, వస్తాడు. నేను తీసుకొస్తాగా. ఏమైపోతాడు? చిన్నవాడా చితకవాడా - అర్జెంటుగా ఏ వూరన్నా వెళ్ళాల్సి వచ్చిందేమో! ఇవాళ చూదాం. రాకపోతే నేను వెళ్ళి నాలుగూ గాలించి, రేపు సాయంత్రానికల్లా లాక్కొస్తాను. మీకెందుకు — వాడిని తీసుకొచ్చే బాధ్యత నాదిగా" అని ధైర్యం చెప్పి, రాజు బజార్లో కాస్త టిఫిను, పొట్లాం కట్టించుకుని రూము చేరాడు.




"ఏమయ్యా రాజా! ఇంకెన్నాళ్ళీ బందిఖానా! చస్తున్నాను బాబూ నీకేం?" అని రామారావు ఏడుపు మొహం వేశాడు.

"ఉండవయ్యా రామయ్యా. ఇంకెంత రేపొక్కరోజు!"

"రేపొక్కరోజు ఎట్లాగేం - మా నాన్న ఫొటో ఇవ్వాలి - అది పత్రికలో పడాలి - పడిన వెంటనే నువ్వు నన్ను తీసుకుపోతే బాగుండదు. మరో రెండురోజులు ఆగాలి. ఓయ్ నాయినోయ్"

"ఇష్ — అట్లా కేకలెయ్యకు - వ్యవహారం మంచి పట్టులో వుంది" అని రాజు జరిగిన విషయాలన్నీ చెప్పాడు.

ఆ రాత్రి రామారావు, రాజు ప్రాణం తీసినంత పని చేశాడు. సెకండు షో సిని మాకు పోదాం అంటాడు. రాత్రిపూట ఎవడు చూడొచ్చాడంటాడు. బ్రతుకు దుర్భ రంగా వుందంటాడు, కావాలంటే తలపాగా చుట్టుకుని, క్రింద క్లాసులో కూచుంటా నంటాడు: రామారావును సముదాయించి. బుజ్జగించి. ఒక్కరోజు ఓపిక పట్టమని ప్రాధేయపడి - అతన్ని ప్రక్కమీద పడుకోబెట్టి, చిచ్చికొట్టి, జోలపాడి నిద్ర బుచ్చినాక గాని, రాజుకు స్తిమితం కళగ లేదు.

రామారావు కనిపించక రెండు రాత్రు లయింది కాబట్టి, ఇంక 'పత్రికా ప్రక టన' మాట ఎత్తవచ్చునని, కాల రెత్తుకుని రాజు రామారావు ఇంటికి వెళ్ళాడు. బట్ట తలాయన బయట కూచుని చుట కాల్చు కుంటున్నాడు. రాజును చూసి, ఆ యన పలకరించను కూడా లేదు.

"ఏం, రాలేదాండీ ?" అన్నాడు రాజు విచారంగా.

"వచ్చాడు" అన్నాడు తండ్రి, తుపు క్కున్న ఉమ్మి.

రాజు గుండె మళ్ళీ ఢామ్మంది. రావ డం ఏమిటి ? ఇదేమిటా్రి బాబూ అను కున్నాడు.

"వాడెందుకొస్తాడయ్యా - రాడు : ఈ ఇల్లు చేదు, మేమంతా విషం పెడుతున్నాం. ఎందుకు వస్తాడు మరి : రాడు" అన్నాడు తండ్రి నిబ్బరంగా.

'అమ్మయ్యా' అనుకున్నాడు రా జు. "ఏమిటోనండీ, ఉన్నట్టుండి ఎందుకిట్లా ప్రవర్తించాడో. అర్థంకావటం లే దు" అన్నాడు ఓరగా ఆయనను చూస్తూ.

"వెధవ ప్రవర్తనలకు అర్థం ఒకటి ఏడుస్తుందేమిటి ? చావనీ నాకేం" అన్నాడు రామారావు తండ్రి మహా కోపంగా.

"మీరు కోప్పడకండి. ఏమిటో, ఏం జరిగిందో. నిన్న నేను అందర్నీ అడిగాను. అన్ని వీధులూ చూశాను. మా స్నేహితులు అనుకున్న వాళ్ళందరి ఇళ్ళూ తిరిగాను. ఎక్కడా లేడు. బహుశా ఈ వూళ్ళో లేడేమో ననిపిస్తుంది"

"ఏడవమను. నేనూ ఇవాళ కను క్కొచ్చాను. కాలేజికి డబ్బు కట్టలేదుట. అది కాస్తా పట్టుకుని ఉడాయించాడు. పోతే పొమ్మను. అంతే ఆ వెధవకి అదే దక్కుడు"

"కాలేజీకి డబ్బు కట్టలేదూ ? నాతో కట్టానన్నాడే" అన్నాడు రాజు ఏదో అనా లని.

"అదో అబద్ధం. ఇటువంటి అబద్ధాల కోరూ, దొంగవెధవా పోవడమే మంచిది. శని వదిలింది" అని రామారావు తండ్రి లేచి, కండువా బుజంమీద వేసుకుని లోప లకు పోయాడు. బట్టతలాయన అగ్గి బుగ్గయిపోతున్నాడే. ఎట్లా అనుకున్నాడు రాజు. అక్కడ కాసేపు చతికిలబడి, ఆయన ఎంతకూ రాకపోగా లేచి లోపలకు వెళ్ళాడు.

"నాకు ఒక ఐడియా వచ్చిందండీ. రామారావు ఫోటో పత్రికలో వేయించి, తప్పిపోయాడు అని రాయించి...." అని రాజు చెప్పబోతున్నాడు.







"చెట్టంత వెధవ తప్పిపోవడం ఏమిటి. లేచిపోయినాడు అని వేయించు" అని చిరాకు పడ్డా డాయన.

"లేకపోతే కనబడుటలేదు అని వేస్తాం. దీనివల్ల ఓ నూరో, నూటపదార్లో మీకు ఖర్చయినా, మనవాడు గ్యారంటీగా దొరుకు తాడు. ఇటువంటి కేసులన్నీ ఇట్లా పరి ష్కారం కావాలసిందే"

"నూరో నూట పదార్లో ఏమిటి"

"అదే మనవాడిని తీసుకొచ్చిన వారికి బహుమానం. ఆ ఆశ పెడితేనేగాని, ఎవరూ తీసుకురారులెండి. డబ్బు అంటే ఎక్క డున్నాసరే ఎవరయినా పడతారు."

"ఇది నీ తెలివా. మరోడిదా—తెల్లారి నట్టుంది బతుకు. వాడి ఫోటో పత్రికలో ప్రకటించే దండగ చాలక, బహుమానం ఒకటా-చాలు చాల్లే ఐన దండగేదో ఐంది. చాలు" అని కోప్పడ్డాడు రామారావు తండ్రి.

"దండగ ఏమిటండీ - ఎంతయినా మన అబ్బాయి" అన్నాడు రాజు కిరెక్కించా లని.

"అబ్బాయ్ ఈ పప్పులేం ఉడకవు. ఈ వెధవని రాళ్ళెత్తమన్నానా - గుళ్ళు మొయ్యమన్నానా - లక్షణంగా బుద్ధిగా చదువుకోరా అని బోలెడంత డబ్బు పోసి చదువు చెప్పిస్తూ వుంటే - అది కిట్టక పోయిన వెధవకోసం మళ్ళీ ఈ ఖర్చు కూడా ఎందుకు ? పోతేపోతాడు. చూదాం ఎంతదూరం వెళతాడో. నేనేం వెతకను - వెతికే ప్రయత్నమూ చెయ్యను" అన్నాడు రామారావు తండ్రి - దూరంగా చుట్ట విసి రేస్తూ. రాజు గుండెలు గడ గడ లాడ సాగాయి. కథేదో అడ్డం తిరిగేట్టుందని భయ పడ్డాడు. ఈయన మామూలుగా ఒప్పుకుంటా డేమో అని అనుకుంటే ఇదేదో బ్రహ్మ ప్రళయం అయేట్టుందే !

"మీరట్లా అంటే ఎట్లా - మ న వా డు, మన బిడ్డ ఏమయిపోతాడోనని మ న ం దిగులుపడాలి....మనం....మరి." అన్నాడు రాజు ఏమంటాడో తనకే అర్థంకాక.

"పోవయ్యా - వెధవను గ ం గ లో దూకమను. నాకేం : నా దేమయినా తప్పుందా ? ఉంటే నువ్వు చెప్పుతో కొట్టు: భరిస్తాను. వాడిని ఓమాట అన్నానా - ఓ ఇదన్నానా - జీతం కట్టరా అని డబ్బిచ్చి నాలుగురోజులో ఐదు రోజులో అయింది. వాడిమీద నమ్మకం వుండబట్టేకదా రశీదు అడగలేదు. మరి అటువంటి నమ్మకద్రోహి

● సభలో మైక్ చెడిపోయింది. ఉపన్యాసమిస్తున్న ఆసామీ ఆఖరి వరసలో కూర్చున్నవాణ్ణి "మీకు వినిపిస్తోందా నే చెప్పేది ?" అని అడిగాడు.

"లేదండి"

మధ్య వరసలో కూర్చున్నవా డొకడు ఆఖరివరసవాడితో; "నాకు వినిపిస్తోంది. మీరిక్కడికి రండి. నే నక్కడ కూర్చుంటాను."

ఇంకా ఎందుకయ్యా నా గడపలో! పోనిద్దూ వాడిష్టం వచ్చిన చోటుకుపోనీ. మనకెందుకు. నువ్వుకూడా ఎక్కడా వెతక్కు. నేనూ వెతకను. వాడే వస్తాడు. చూస్తూ వుండు" అన్నాడు రామారావు తండ్రి ఖచ్చితంగా.

రాజుకు ఇంకేమీ తోచలేదు. వళ్ళు వేడెక్కిపోయింది. కాళ్ళూ చేతులూ గిలగిల లాడసాగాయి. గుండె తొందరగా కొట్టుకుంటోంది. ఏం చెయ్యాలో అర్థం కాలేదు. "ఐతే ప్రకటన వేయించ వద్దంటారా" అన్నాడు రాజు - తడబడుతూ.

"అంటారా ఏమిటి—అన్నాను. అంతే! ఏమీవద్దు - ఏమీ వేయించను"

"మీకు తెలీదు...."

"నా కన్నీ తెలుసును పోవయ్యా" -

రాజు మూర్ఛపోయినంత పనిజేశాడు. అంటే - కొంపదీసి తమ వ్యవహారం ఎఘగునా ఏమిటి - చచ్చాం!

"అంటే?" అన్నాడు నెమ్మదిగా.

"అంటేలేదు. కొంటేలేదూ. నువ్వు నా ప్రాణం తియ్యకు. మన తప్పేమీ లేకుండా, వూరికినే పారిపోయిన వెధవ కోసం డబ్బు ఖర్చుపెట్టాలా - ఛీ! ఛీ! దరిద్రగొట్టు వెధవ—పోనీ" అని బట్టతలాయన లేచి వెళ్ళిపోయాడు. రాజుకు తలా తోకా అందలేదు. నీటమునిగి పోతున్నవాడిలాగా కొట్టుకున్నాడు. ఆయన వెళ్ళిన - వెనకే వెళ్ళి మళ్ళీ చెప్పాడు. ఆయన వినలేదు. ఆయన భార్య చేత కూడా చెప్పించాడు. ఏమీ లాభం లేకపోయింది. వాడి విషయం ఎత్తితే ఇంక వూరుకునేది లేదనికూడా రామారావుతండ్రి గద్దించాడు.

రాజు కాళ్ళీడ్చుకుంటూ రూముచేరి, ఈ శుభవార్త కాస్తా రామారావు చెవిని వెయ్యగా, రామారావు కొయ్యబారిపోయాడు.

"ఇంకేది దారి రాజూ" అన్నాడు రామారావు.

"ఇదేదారి. ఇట్లాగే పోయావంటే మీ ఇల్లొస్తుంది"

"హాస్యం ఆడుతున్నావా, ఇప్పుడా!" అన్నాడు ఏడుపుమొహం వేసి రామారావు.

"మన పాచిక పారనందుకూ, ఈ పడిన అవస్థకూ నవ్వొస్తోంది. ఏడుపూ వస్తోంది. హాస్యం ఒక్కటేగాదు, విషాదంకూడా పలికిస్తాను" అని వాగసాగాడు రాజు.

"ఐతే ఏం చెయ్యమంటావు?"


"చేసేది ఒకటే. ఇంక మీ నాన్న ఎట్లాగూ దానికి ఒప్పుకోడు. ఎన్నివిధాల చెప్పాలో అన్నివిధాలా చెప్పాను. మీ అమ్మగారు చెప్పింది - ఆయన పట్టే ఆయనది. నువ్వే వస్తావనే నమ్మకంతో వున్నాడు. నువ్వు కాలేజీకి డబ్బు కటని సంగతికూడా ఆయనకు తెలిసిపోయింది. కాబట్టి నువ్వు ఈ రాత్రి ఇంటికివెళ్ళి ఏదో పెద్ద బొంకు బొంకు. ఆ డబ్బు విషయం కూడా ఏదో చెప్పు. ఆయనే డబ్బిస్తాడు. అది తీసుకెళ్ళి కాలేజీకి కట్టు. అంతే. అంతకన్నా చేసేదేంలేదు. ఐందేదో ఐంది. ఇంకా నయం, ఆ అడిగేదేదో ఇవాళే అడిగేను. రెండురోజులు ఆగానుకాదు" అన్నాడు రాజు.

జరిగినదానికి వగచి లాభం లేదని రామారావూ తెలుసుకొన్నాడు. ఇంటికి వెళితే తన తండ్రి ప్రాణాలు తీసెయ్యడు. తిడితే తిడతాడు. పెద్ద అబద్ధం అడితే అదే సర్దుకుపోతుంది. అత్యాశకుపోతే ఇట్లాగే అవుతుంది - అని నీతిపాఠాలుకూడా చెప్పుకుని యింటికి పోవడానికే నిశ్చయించుకున్నాడు రామారావు.

కొంత భయంతోనూ, మరికొంత ఆలోచనతోనూ రామారావు వెంటనే ఇంటికి బయల్దేర లేకపోయాడు. రాత్రే వెళితే మంచిదని అతనికి తోచింది. తన తండ్రిది అదోరకం కోపం. రానంతసేపు రాదు. వచ్చిందా అది ఆగదు. ఆ భయంతోనే అతను నెమ్మదిగా ఆరాత్రి ఇంటికి బయల్దేరాడు.

తలుపు కొట్టటానికి రామారావుకు భయంగానే వుంది. తను చేసిన పనిమీద అసహ్యం కూడా కలిగింది. పెద్ద సాధించేవాడల్లే ఈ దంభాలూ, పథకాలూ తలచుకుని తనను తనేతిట్టుకున్నాడు. రాజుఐడియా ఇచ్చాడు. ఇచ్చినంత మాత్రాన తనెందుకు ఒప్పుకున్నానని, ఇప్పుడు బాధపడ్డాడు. కాస్సేపు పోయాక తలుపు తట్టి పిలిచాడు. పిలిచీ పిలవగానే వాళ్ళమ్మ వచ్చి తలుపుతీసి 'నాయనా' అని బావురుమంది.

"ఏంరా, ఎక్కడికి దయచేశావు? కొంప ఇప్పుడు తెలిసిందా, వెళ్ళి అక్కడెక్కడో వుండకపోయావూ! భయం భక్తీ లేకుండా నీ ఇష్టం వచ్చినట్టు తిరగడమూ పోపో - నా ఇంట్లోకి రాకు-పో" అని తలుపులు మూసేశాడు తండ్రి. రామారావు తల్లి ఎంతచెప్పినా, గోలపెట్టినా కూడా ఆయన తియ్యలేదు. బయటనుంచి రామా



రావు "నాన్నా. నాన్నా" అని ఎన్నిసార్లు పిలిచినా ఆయన తలుపు తియ్యటంలేదు, సమాధానం చెప్పటంలేదు.

పిలిచి. పిలిచి రామారావు ఆ అరుగు మీద చీకట్లో చతికిలబడ్డాడు. బాగా ఏడుపొచ్చింది. ఏడిచాడు. తనవంటి వెధవకు కావలసిందే అనుకున్నాడు. తన తండ్రి మొండి పట్టుదల ఇప్పు డర్థమయింది. తన కింక ఈ ఇంట్లో స్థానం లేదా ? ఏవేవో ఆలోచించుకుంటూ, చాలసేపు ఆ అరుగు మీదే కూచున్నాడు రామారావు.

తెల తెల వారుతూ వుండగా రామారావు తండ్రి లేచి, నెమ్మదిగా తలుపుతీసి తన కుమారుని కోసం అరుగువంక చూశాడు. రామారావు అక్కడ లేడు! ఆయన గాభరాగా అటూ ఇటూ చూశాడు. రెండు మూడు సార్లు పిలిచాడు. ఎక్కడా జాడ లేదు. రామారావు తల్లీ, తండ్రీ ఇద్దరూ గొల్లుమన్నారు. రామారావు ఈసారి నిజంగానే ఎక్కడికో వెళ్ళిపోయాడు.

రెండురోజులు గడచిపోయింది. ఆ రాత్రి రామారావు రాజు రూముకు వెళ్ళ లేదు. రామారావు తండ్రీ, తమ్ముడూ, రాజూ అతనికోసం అంతటా చూశారు. ఎక్కడా కనిపించలేదు.

"వాడికి బుద్ధొస్తుందేమోనని ఆ మాట అన్నాను బాబూ! లేకపోతే రేపొద్దున్న కూడా ఇట్లాగే చేసి ఇంటికొచ్చి తలుపు కొడతాడు. తీసి లోపలకు రానిస్తే మనం లోకువ అవుతాం గదా అని, కాస్త శిక్ష విధిద్దామని అట్లా చేశాను. మళ్ళీ ఇంతపని చేస్తాడనుకోలేదు. వెళ్ళినవాడు ఇంటికి వచ్చాడని ఎంతో సంతోషించాను. ఈసారి ఎక్కడికి వెళ్ళాడో, ఏమైనాడో నాకు మరీ దిగులుగా వుంది" అని రామారావు తండ్రి కళ్ళు తుడుచుకున్నాడు. రాజుకు కూడా కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి.

మరి కాస్సేపటికి రామారావుతండ్రి ఏదో వూహ తట్టిన వాడల్లే చటున లేచి గదిలోకెళ్ళి రామారావు ఫోటో ఒకటి వెతికి తీసి బల్లమీద పెట్టాడు.

"ఎంత బహుమానమయినా ఇద్దాం. ఆ పత్రిక చిరునామా ఏమిటి నాయనా రాజూ !" అంటూ ఆతృతగా బయట కొచ్చాడు రామారావు తండ్రి, కలంతోనూ, కవరుతోనూ సహా !

## నిర్వచనాలు

స్వగృహం : మనం ఆడింది ఆట, పాడింది పాటగా చెల్లుబడి అయ్యే ప్రదేశం (పెళ్లికాకముందు)

డాక్టరు: ఇతరులు బాగపడుతున్నంతకాలం బాధ పడనక్కర లేనివాడు





ఈ మధ్య మా యింటికి మా బంధువొకాయన భోజనానికి వచ్చాడు. భోజనం చేస్తుంటే మా క్రిష్ణ "హి హి హి" అన్నాడు. దాంతో ఆయనకి కోపంవచ్చి "నవ్వటానికి ముందు ఏదేనా కారణంవుండాలోయ్. ఊరికే అలా నవ్వకూడదు" అని చల్లగా చీవాట్లేశాడు. వెంటనే నాకు నవ్వొచ్చింది. కానీ ఆయన అన్నది ఎంతవరకూ నిజమా అని ఆలోచించసాగాను.

"నీ ముఖం అందంగా వుండాలంటే ఎప్పుడూ చిరునవ్వు నవ్వుతూ ఉండు" అని ఒక గొప్ప సౌందర్యవతి తన రహస్యం ఓ సారి నాతో అంది. అసలు నవ్వుగురించి మన శాస్త్రకారులు కూడా చాలా రాశారు. స్త్రీకి చిరునవ్వు చిందే పెదాలు ఎంతో శోభనిస్తాయని ఒకరంటే ఎప్పుడూ నవ్వటం ఎంతో ఆరోగ్యమైన విషయం అని యింకొకరన్నారు. ఎప్పుడూ నవ్వకుండా ఉన్నవాళ్ళని చూస్తే వడ్లగింజ వేస్తే పేలగింజ అవుతుంది దాని ముఖంమీద అంటారు. సరే నవ్వమన్నారు కదా అని కాస్త ఎక్కువ నవ్వామో "అంత వెకిలితనమేమిటి హన్నా" అని మందలిస్తారు. ఒకవైపు నవ్వండి అంటూ యింకోవేపు వెకిలితన మంటే ఎలా ?

అసలు ఆడవారి నవ్వుగురించి శాస్త్రంలో యిరా— అంటే యిన్ని రకాలుగా చెప్పేరు. 'స్మిత, హసిత, విహసిత, అపహసిత, అతిహసిత. కళ్ళలో కాంతి కొంత కలిగేటట్టు నవ్వితే స్మిత అని. కొంచెం పళ్ళు కూడా కనిపిస్తే హసిత అని, దీనికితోడు చిన్న ధ్వని చేస్తే విహసిత అని, శరీరంకూడా కదిలితే అపహసిత అని అంటారుష. అలాగే మనం కిల కిల నవ్వటమనీ, పక పక నవ్వటమనీ అంటూంటాము.